సాక్షి
నిజామాబాద్
శనివారం । 29 । జూన్ । 2024



రెన్యువల్ సరే.. వేతనాలేవి?

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెన్యువల్ చేసినా పెండింగ్ వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదు.

- 8లో ▸



ఏసీబీ నజర్!

ఉమ్మడి జిల్లాపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి సారించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే రంగంలోకి దిగుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /24.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కేంద్ర ఆర్థికమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఎంపీ అర్వింద్ ధర్మపురి శుక్రవారం ఢిల్లీలోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రెండోసారి ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలియజేశారు. అలాగే రెండోసారి ఎంపీగా విజయం సాధించడంపై ఎంపీ అర్వింద్‌కు నిర్మలా సీతారామన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పలు ప్రాధాన్యత అభివృద్ధి పనులపై చర్చించారు.

ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కేటాయించండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గానికి కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని శుక్రవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా మధిరకు ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను కేటాయించారని.. మూడో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఆర్మూర్‌కు కేటాయించాలని కోరారు. అదేవిధంగా ఆర్మూర్ నియోజకవర్గంలో నిధుల కేటాయింపులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి పార్టీ నుంచి అనుమతి ఇవ్వాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి




నిజామాబాద్‌నాగారం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ తెలిపారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా నగరంలోని గౌతం నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుసేనా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సీఎం..

జిల్లాలో ఉత్కంఠ!

రాష్ట్రంలో కీలకమైన పదవులు భర్తీ చేయాల్సిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో పార్టీ అధిష్టానంతో కొన్ని రోజులుగా సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు. కాగా పీసీసీ పీఠం రేసులో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, కేబినెట్ బెర్త్ కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పోటీలో ఉండటం కారణంగా జిల్లా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. ఇదిలా ఉండగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి రైతు కమిషన్ చైర్మన్ దక్కనున్నట్లు తెలుస్తోంది.

- పార్టీ అధిష్టానంతో ఎడతెగని చర్చలు
- పీసీసీ పీఠం రేసులో మహేశ్‌గౌడ్ ముందంజ
- కేబినెట్ బెర్త్ కోసం సుదర్శన్‌రెడ్డి ఎదురు చూపులు
- పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రైతు కమిషన్ చైర్మన్ దక్కనున్నట్లు చర్చ



మహేశ్‌కుమార్‌గౌడ్
సుదర్శన్‌రెడ్డి
పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారత రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుల తరబడి బిజీబిజీగా గడుపుతున్నారు. రాష్ట్రంలో పీసీసీ పీఠం, భర్తీ చేయాల్సిన కేబినెట్ బెర్త్‌లు, కీలకమైన నామినేటెడ్ పదవులు తదితరాలకు సంబంధించి పార్టీ అగ్ర నాయకత్వంతో సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో కీలకమైన పదవుల విషయమై ఉమ్మడి జిల్లాలో హాట్ టాపిక్ నడుస్తోంది.

ముఖ్యంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ముందంజలో ఉన్నారు. ఈ పదవి కోసం మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, మధుయాష్కీ గౌడ్ రేసులో ఉన్నప్పటికీ మహేశ్‌గౌడ్ వైపే అధినాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థి సంఘం నాయకుడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన మహేశ్‌గౌడ్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యక్రమాల నిర్వహణ విషయంలో దిట్టగా పేరుపొందారు. ఈ క్రమంలో పార్టీ అగ్రనాయకత్వం సైతం మహేశ్‌గౌడ్‌కు మంచి ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. గత ఎన్నికల ముందు నుంచి ఇప్పటి వరకు మహేశ్‌గౌడ్ ఆర్గనైజింగ్ కార్యకలాపాల విషయంలో చేసిన కృషి ఎనలేనిదని ఏఐసీసీ నాయకత్వం గుర్తించింది. దీంతో ఆయనకు పీసీసీ పీఠం అప్పగించే విషయమై కసరత్తులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం మహేశ్‌గౌడ్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. దీంతో జిల్లా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

■ మరోవైపు కేబినెట్ విస్తరణపైనా ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయి. జిల్లా నుంచి మంత్రి పదవి రేసులో పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ముందంజలో ఉన్నారు. మొదటి విడతలోనే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని భావించినప్పటికీ ఆలస్యం అవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపైనా ఏఐసీసీ పెద్దలు ముఖ్యమంత్రితో విడతలవారీగా చర్చలు జరుపుతున్నారు. ఈ సమయంలోనే పార్టీలోకి పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల చేరికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జిల్లాకు కేబినెట్ బెర్త్ కేటాయించే విషయంలో మరింత ఆలస్యం అవుతూ వస్తోంది. దీంతో పార్టీ శ్రేణులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

■ ఇటీవల బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పోచారం సీనియారిటీని ఉపయోగించుకునేందుకు ఆయనకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జిల్లాలో తీవ్ర చర్చ నడుస్తోంది. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రైతు కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రైతుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు సదరు కమిషన్‌కు పోచారంను చైర్మన్ చేసే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి ఇప్పటికే ఈ విషయాన్ని ఢిల్లీ పెద్దలకు విన్నవించినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో సీఎం ఎడతెరిపి లేని చర్చలు జరపడం, కీలక పదవుల కోసం జిల్లా నుంచి రేసులో ఉన్న నేపథ్యంలో రాజకీయంగా ఆసక్తికర వాతావరణం నెలకొంది.

‘భగీరథ’ సర్వే 97శాతం పూర్తి

- ఈనెల 11న ప్రారంభమైన సర్వే
- నీటి సరఫరా తీరుపై యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది
- జిల్లాలో 2,46,546 నల్లా కనెక్షన్ల వివరాల సేకరణ



భీమ్‌గల్‌లో భగీరథ నీటి సరఫరాపై సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

మోర్తాడ్(బాల్కొండ): మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీటి సరఫరా జరుగుతున్న తీరుపై జిల్లాలో చేపట్టిన సర్వే 97శాతం వరకు పూర్తయ్యింది. మరో మూడు శాతం సర్వేను రెండు, మూడు రోజుల్లో ముగిస్తామని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొంటున్నారు. 2015లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి శుద్ధిచేసిన జలాలను అందించాలని మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసింది. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్‌ను ప్రత్యేకంగా ఇచ్చి నీటి సరఫరాను ప్రారంభించారు. ఒక వ్యక్తికి వంద లీటర్ల నీటిని, ఒక కుటుంబానికి గరిష్ఠంగా 500ల లీటర్లను నిత్యం సరఫరా చేయడానికి మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మిషన్ భగీరథ పథకం అమలుతీరుపై సర్వే జరిపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పంచాయతీ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్వేను ఈనెల 11 నుంచి మొదలు పెట్టారు. ప్రత్యేక యాప్‌లో మిషన్ భగీరథ నీటిని అందుకుంటున్న వారి వివరాలతో పాటు నీటి సరఫరా తదితర అంశాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 530 పంచాయతీల పరిధిలో శుక్రవారం నాటికి 2,46,546 నల్లా కనెక్షన్లు ఉన్న ఇళ్లను పంచాయతీ ఉద్యోగులు సందర్శించారు. ఇంటి యజమాని ఫొటోను తీయడం, వివరాలను నమోదు చేయడం పూర్తిచేశారు. మరో మూడు శాతం సర్వే పూర్తి కావాల్సి ఉండగా ఇంటి పేర్లు తప్పుగా నమోదు కావడం, కొన్ని కనెక్షన్లు ఎక్కడ ఉన్నాయో ఆచూకీ దొరకకపోవడం, ఇంటి పేర్లు, యజమాని పేర్లు ఒకే విధంగా ఉండడం ఇతరాత్ర కారణాలతో మూడు శాతం సర్వే పూర్తి కాలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో సర్వే వంద శాతం పూర్తి అయ్యింది. అయితే మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఎక్కడ కూడా అసంతృప్తి వ్యక్తం కాలేదని పంచాయతీ అధికారులు వెల్లడించడం విశేషం.

మిగిలిన సర్వేను పూర్తి చేయిస్తాం

మిషన్ భగీరథ సర్వే జిల్లాలో దాదాపు పూర్తి కావచ్చింది. మరో మూడు శాతం సర్వే మాత్రమే పూర్తి చేయాల్సి ఉండగా కొన్ని కారణాలతో ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో వంద శాతం పూర్తవుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందించడానికి సిద్ధం చేస్తున్నాం.

– తరుణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

వరంగల్‌కు డీలక్స్ బస్సులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి వరంగల్ వరకు నూతనంగా డీలక్స్ బస్సులను నడుపుతున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య ఆదరణ పెంచడానికి టీజీఆర్టీసీ ద్వారా లక్కీడ్రా స్కీం ఏర్పాటు చేశామన్నారు. బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులు తమ గమ్యస్థానం చేరగానే, మీరు తీసుకున్న టికెట్ వెనకాల మీ పేరు, గ్రామంతో పాటు ఫోన్‌నంబర్ రాసి బస్సులో డ్రైవర్ వెనక గల లక్కీడ్రా బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు డ్రా తీసి విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి బహుమతులు పొందాలని అలాగే ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు.

బస్సు వేళలు..

నిజామాబాద్ నుంచి ఉదయం : 06.00, 06.30, 07.15, 07.45, 08.15, 08.45
వరంగల్ నుంచి మధ్యాహ్నం : 01.15, 01.45, 02.30, 03.00, 03.30, 04.00

ఎన్నికల డబ్బుల పంపిణీలో గందరగోళం

- నగర కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహారం
- పనిచేయని వారికి కూడా డబ్బులు ఇవ్వడంపై ఆగ్రహం



నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన మున్సిపల్ అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల జీతభత్యాల పంపిణీలో గందరగోళం ఏర్పడింది. విధులు నిర్వహించింది కొందరైతే.. పనిచేయని వారికి కూడా డబ్బులు పంపిణీ చేయడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కమిషనర్ ఆదేశాల మేరకు పగలు, రాత్రి తేడా లేకుండా విధులు నిర్వహించిన తమకు డబ్బుల పంపిణీలో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తతంగం అంతా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎదురుగా ఉన్న మేనేజర్ చాంబర్‌లో జరగడం గమనార్హం.

రూ. 56 లక్షలు వచ్చినా..

వాస్తవానికి ఎన్నికల్లో సుమారు 200 మంది వరకు మాత్రమే విధులు నిర్వహించినా.. కమిషనర్‌కు దగ్గరగా ఉండే అధికారులు వందల సంఖ్యలో ఉద్యోగుల డబ్బులు పంపిణీ చేయడంతో.. అన్యాయానికి గురైన ఉద్యోగులు ప్రశ్నించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి రూ. 56 లక్షలకుపైగా జీతభత్యాలు వచ్చాయి. అయితే వీటిని విధులు నిర్వహించిన వారికి మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. ఇష్టారాజ్యంగా పంపిణీ చేయడంతో ఉద్యోగులు డబ్బులు తీసుకోకుండా అసహనంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై కమిషనర్‌ను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నట్లు సమాచారం.

ఉద్యోగులు వెనక్కి వెళ్లిపోయారు

డబ్బుల పంపిణీ విషయంలో కొంత మంది ఉద్యోగులు తమ అన్యాయం జరుగుతోందని వెనుతిరిగి వెళ్లిపోయిన విషయం వాస్తవమే. అయితే సౌత్ ఎమ్మార్వో ఇచ్చిన జాబితా ప్రకారమే డబ్బులు పంపిణీ చేశాం. ఇంతకు మించి నాకు ఏమి తెలియదు.

– సునీల్ కుమార్, మున్సిపల్ మేనేజర్

మళ్లీ భూసార పరీక్షలు..

- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా బాల్కొండ
- మట్టి నమూనాల సేకరణను ప్రారంభించిన అధికారులు
- నేల స్వభావం కోసం పరీక్షలు



బాల్కొండలో మట్టినమూనాలను సేకరిస్తున్న అధికారులు

బాల్కొండ: రాష్ట్రంలో ఇక నుంచి మళ్లీ మట్టి నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. నేల స్వభావం తెలుసుకోవడం వల్ల కావాల్సిన పోషకాలను అందించి పంటల్లో అధిక దిగుబడులు సాధించొచ్చు. అందుకే మళ్లీ భూసార పరీక్షలు చేయనున్నామని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో భూసార పరీక్షల కోసం బాల్కొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా వ్యవసాయ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. దీంతో వ్యవసాయ అధికారులు మట్టి నమూనాల సేకరణను ప్రారంభించారు. మండలంలో 10,600 ఎకరాల్లో పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంటల సాగు ప్రారంభమై విత్తనాలు విత్తడంతో ఖరీఫ్‌లో 25 శాతం, రబీలో 75 శాతం మట్టి నమూనాలనుసేకరించాలని ఉన్నతాధికారులు సూచించారు. బాల్కొండ మండలంలో 2021 మట్టి నమూనాలను సేకరించనున్నారు.

మట్టి నమూనాలను తీయాల్సిన విస్తీర్ణం..

సాధారణంగా ఒక పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం పెద్దదైతే ప్రతి 5 ఎకరాల్లో ఒక నమూనా తీయాల్సి ఉంటుంది. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం నేల వాలు, చౌడు, క్షార ఆమ్ల గుణాలు, పంటల సరళి, పలు విషయాల్లో తేడాలు కనిపిస్తే అన్ని నమూనాలను ఆ పొలం నుంచి తీయాల్సి వస్తుంది. అలా సేకరించిన మట్టి నమూనాలను జూలై 10 వరకు పూర్తి చేయాలి. జూలై 31న మట్టి పరీక్ష కేంద్రంలో మట్టిని పరీక్షించిన ఫలితాలను రైతులకు వివరాలతో అందజేయాలి.

ఉపయోగాలు..

భూసార పరీక్షలతో పొలంలో వివిధ పోషకాల స్థాయి తెలుస్తుంది. దీంతో పొలంలో ఏయే పంటలు పండించాలో అవగాహన వస్తుంది. ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది. నేల సమస్యలైన కారి, చౌడు మొదలైనవి తెలుస్తాయి. దీంతో వాటిని నివారించవచ్చు. ఎరువులపై అనవసర ఖర్చులను తగ్గించుకోవచ్చు.

రైతులకు ఉపయోగకరం..



భూసార పరీక్షలతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మట్టి నమూనాలు సేకరించిన ప్రాంతంలో నేల భూసార పరీక్షల పత్రాలను అందిస్తాం. పత్రంలో భూమికి సంబంధించిన అన్ని వివరాలుంటాయి. రైతుల వద్ద ఈ పత్రాలు ఏ పంట సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందో తెలుస్తుంది. మట్టి నమూనా సేకరణను వేగవంతం చేస్తున్నాం.

– మహేందర్‌రెడ్డి, వ్యవసాయాధికారి, బాల్కొండ

ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడాలి

- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా నాయకులు ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, గంపగోవర్ధన్, జాజాల సురేందర్, సింధే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. శుక్రవారం మెదక్ జిల్లా ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో కేసీఆర్ కామారెడ్డి జిల్లాలో పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, గంప గోవర్ధన్, జాజాల సురేందర్‌లతో వివిధ అంశాలపై చర్చించారు.

అయితే ఈ సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఉన్నారు. తాజా రాజకీయ పరిస్థితులపై వీరితో చర్చించారు. కేసీఆర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ముందుకెళ్లే విషయమై పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పార్టీ నిర్మాణం చేయాలన్నారు. పార్టీ నుంచి వలసలు వెళుతున్న వారి విషయమై పెద్దగా పట్టించుకోవద్దన్నారు. యువతపై దృష్టి సారించి కొత్త నాయకత్వాన్ని అన్నిస్థాయిల్లో తయారు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి ప్రజల సమస్యలపై పోరాటాలు చేస్తూ ముందుకెళ్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు.

410 పింఛన్ల నిలిపివేత

- ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి సభ్యులుగా గుర్తింపు
- రూ. 2.68 కోట్ల రికవరీకి అధికారుల చర్యలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు చాటుగా సామాజిక భద్రతా పింఛన్(ఆసరా) పొందుతున్న వారి గుట్టు రట్టయ్యింది. సాంకేతిక పరిజ్ఞానంతో అలాంటి వారిని గుర్తించిన ప్రభుత్వం జిల్లాలో 410 మందికి పింఛన్లను నిలిపివేసింది. పింఛన్ డబ్బులు డ్రా చేసుకోకుండా వారి బ్యాంకు ఖాతాలను, పోస్టాఫీసు అకౌంట్లను ఫ్రీజ్ చేసింది. ఇన్ని రోజుల పాటు పొందిన పింఛన్ డబ్బులను రికవరీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మండలాల వారీగా డేటాను తీశారు. నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు పొందిన వారి వివరాలతో ఎంపీడీవో ఆఫీసులకు లేఖలు రాశారు. వారి నుంచి డబ్బులను తిరిగి రాబట్టాలని లేఖల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 410 మందిని గుర్తించగా వీరి నుంచి రూ. 2.68 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. త్వరలోనే ఎంపీడీవోలు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయనున్నారు.

సమర్థవంతంగా పనిచేయాలి



ఆర్మూర్‌లో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవి కుమార్

ఆర్మూర్/మోర్తాడ్/బాల్కొండ : కళాశాలల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని డీఐఈవో రవి కుమార్ సూచించారు. ఆర్మూర్, మోర్తాడ్, బాల్కొండ మండలాల్లోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలిచ్చారు. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అడ్మిషన్లపై అధిక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. కళాశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ప్రచారం నిర్వహిస్తూ టెన్త్ పాసైన ప్రతి విద్యార్థిని కళాశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రతి అధ్యాపకుడు తన వంతు కృషి చేయాలని, సమర్థవంతంగా పనిచేయించడానికి ప్రిన్సిపాల్ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధ్యయనంతో శిఖరాగ్రాలకు చేరొచ్చు

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన రమేశ్ కార్తీక్ నాయక్

నిజామాబాద్‌అర్బన్: కవిత్వం పాఠకుల హృదయాల్లో ఆర్ద్రత నింపుతుందని.. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన రమేశ్ కార్తీక్ నాయక్ అన్నారు. కవిత్వం రాయాలంటే నిరంతర అధ్యయనం చేయాలని.. అప్పుడే శిఖరాగ్రాలకు చేరవచ్చని పేర్కొన్నారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ‘మంచి కవిత్వం’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ కార్తీక్ నాయక్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన ద్వారా జిల్లాకు సాహిత్య రంగంలో విశిష్టమైన స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువతరం సాహిత్యం వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రముఖ కవి బీఎస్‌బీ మాట్లాడుతూ సామాన్య ప్రజల భాషలోనే కవిత్వ భాష దాగి ఉంటుందన్నారు. దానిని మనం అన్వేషించగలిగితే చక్కని సాహిత్యాన్ని సృష్టించగలమని పేర్కొన్నారు. హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ మన జిల్లాకు తొలిసారిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం 26 ఏళ్ల వయసులోనే అత్యంత పిన్న వయస్కుడిగా ఆ పురస్కారాన్ని అందుకోవడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ రమేశ్ కార్తీక్ నాయక్ స్ఫూర్తి ఈనాటి యువతరంపై తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి తిరుమల శ్రీనివాస్ ఆర్య, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, విట్టం ధనుంజయ్, భట్టు శ్రీధర్, పద్మజారెడ్డి, కామినేని రేణుక, సిర్పలింగం, మల్లవరపు చిన్నయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టరేట్ సాధించిన గంట్యాల ప్రసాద్, సాహిత్య అవార్డులు అందుకున్న ఆరుట్ల శ్రీదేవి, కళా గోపాల్, వసంత లక్ష్మణ్‌లను సత్కరించారు. అలాగే దివంగత మాజీ ప్రధాని, సాహితీవేత్త పీవీ నర్సింహారావు జయంతిని నిర్వహించారు.



మంచి కవిత్వం కార్యక్రమంలో పాల్గొన్న కవులు రమేశ్ కార్తీక్ నాయక్, ఘనపురం దేవేందర్

క్లుప్తంగా

టెన్త్‌ సప్లిమెంటరీ ఫలితాల్లో 81 శాతం ఉత్తీర్ణత

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 1,490 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,207 మంది ఉత్తీర్ణత సాధించారు. 81.01 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 83.93 శాతం, బాలుర 79.09 శాతం మంది పాసయ్యారు. రీవెరిఫికేషన్‌ కోసం జూలై 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రీవెరిఫికేషన్‌ కోసం విద్యార్థులు రూ. వెయ్యి, రీకౌంటింగ్‌ కోసం రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేపట్టాలి



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం చేపూర్‌ గ్రామంలో కబ్జాకు గురైన శ్మశాన వాటికకు సంబంధించిన ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించాలని గ్రామస్తులు శుక్రవారం ఆర్మూర్‌ ఆర్డీవో రాజాగౌడ్‌, ఏసీపీ బస్వారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబరు 135/2, 135/3, 135/4 ఉన్న ఒక ఎకరం 23 గుంటల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన సారంగి విజయ్‌ 25 ఏళ్ల క్రితం కబ్జా చేశాడని ఆరోపించారు. అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్‌ చేయించుకుని భూమిలోకి గ్రామస్తులను ఎవరిని రానివడం లేదన్నారు. ప్రభుత్వ భూమిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని 20 ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేక పోయిందని గ్రామస్తులు ఆర్డీవో, ఏసీపీ ఎదుట వాపోయారు. కలెక్టర్‌ విచారణ జరిపించి అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించాలని కోరారు.

డ్రోన్‌తో పురుగు మందు స్ప్రే



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌):యాంత్రీకరణలో వ్యవసాయ రంగం దూసుకుపోతోంది. ఆధునిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకుంటున్నారు. నాట్ల నుంచి మొదలుకొని పంట కోసే వరకు పూర్తిగా యంత్రాలే పని చేస్తున్నాయి. శుక్రవారం డొంకేశ్వర్‌ మండలం దత్తాపూర్‌ గ్రామానికి చెందిన సతీష్‌ అనే యువరైతు డ్రోన్‌ సహాయంతో పంటలకు మందును స్ప్రే చేశాడు. ఎకరానికి రూ.400 చొప్పున డ్రోన్‌ని అద్దెకు చెల్లించి మక్క, సోయాకు పిచికారి చేయించాడు. రెండెకరాల విస్తీర్ణాన్ని కేవలం 10 నిమిషాల్లో డ్రోన్‌ పూర్తి చేసింది.

ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి: ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్‌, నిజామాబాద్‌, కరీంనగర్‌, వరంగల్‌ ఉమ్మడి జిల్లాలతోపాటు సిద్దిపేట జిల్లాను కలుపుకొని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఫోరం అధ్యక్షుడు ఫణి శుక్రవారం తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని ఆయా రైల్వే మార్గాల్లో నూతన రైళ్ల ప్రతిపాదనలు, స్టేషన్లలో నెలకొన్న సమస్యలు, రైల్వే ఓవర్‌ బ్రిడ్జి, అండర్‌ బ్రిడ్జిల నిర్మాణం, ప్రయాణీకుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్యను పెంచేలా అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి ఈ ఫోరం ఏర్పాటు అయినట్లు చెప్పారు. అధ్యక్షుడిగా ఫణి, జనరల్‌ సెక్రెటరీగా శ్రీనివాస్‌, జాయింట్‌ సెక్రెటరీగా సిరిపురం సాయికృష్ణ, ట్రెజరీగా మోహన్‌ గంగుల తదితరులు ఎన్నికయ్యారు.

ఏసీబీ నజర్‌!

- అవినీతి అధికారులపై దాడులు
- చేయి తడిపితే కానీ పలు శాఖల్లో పనులు కాని పరిస్థితి
- అప్రమత్తం అవుతున్న అధికారులు



నిజామాబాద్‌లోని ఏసీబీ కార్యాలయం



ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అవినీతికి అండగా నిలిచే ప్రధాన శాఖలపై ఫోకస్‌ పెట్టారు. జనవరి నుంచి జూలై వరకు నాలుగు చోట్ల దాడులు నిర్వహించి, ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులు రెవెన్యూ, పోలీసు శాఖ, మున్సిపల్‌ శాఖలకు పరిమతం కాగా ఇప్పుడు అన్ని శాఖల్లో జరుగుతున్న అవినీతిపై కన్నేశారు. ప్రస్తుతం అవినీతి తిమింగలాలు అన్ని శాఖలలో విస్తరించారు. చేతులు తడపనిదే పనులు కావడం లేదు. దీంతో అధికారుల తీరుతో విసిగి వేసారేసిన బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

ఆదాయానికి మించిన ఆస్తులపై దృష్టి

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారులపై ఏసీబీ దృష్టి సారించింది. సదరు ఉద్యోగి కుటుంబ సభ్యుల నుంచి ఆదాయ వివరాలను తెలుసుకొని వాటి తర్వాత ఉద్యోగికి వచ్చిన నెలసరి వేతనం వివరాలను పక్కాగా పరిశీలించిన తర్వాత అధికారులపై చర్యలు తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా పోలీసు, ఎక్సైజ్‌, రెవెన్యూ, పంచాయితీరాజ్‌, నీటిపారుదల, మున్సిపల్‌, రవాణా, రిజిస్ట్రేషన్‌, విద్యుత్‌ శాఖలలో అవినీతి ఆరోపణలు తరుచు వినిపిస్తుంటాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారుల వివరాలు ఏసీబీ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం.

పైసలు ఇస్తేనే పని

ఒక వైపు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న అధికారులు అవినీతిని మాత్రం వదలడం లేదు. చేతులు తడిపితేనే పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పౌరసరఫరా శాఖలో ప్రతి దానికి ఓ రేట్‌ నిర్ణయించి కేటాయింపులు చేస్తారనే ప్రచారం ఉంది. ఇటీవల ఈ శాఖకు చెందిన ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా డబ్బులు ఇవ్వని వారిని అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో పనుల కోసం వచ్చిన వారు ఎంతో కొంత ముట్టజెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఏసీబీ అధికారుల వివరాలు

టోల్‌ ఫ్రీ నంబర్‌	1064
శేఖర్‌గౌడ్‌, ఏసీబీ డీఎస్పీ, ఉమ్మడి నిజామాబాద్‌	9154388950
నగేశ్‌, ఏసీబీ సీఐ, నిజామాబాద్‌	9154388951
శ్రీనివాస్‌, ఏసీబీ ఎస్సై, కామారెడ్డి	9154388953

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి

పనుల కోసం అధికారులు లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయాలి. టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1064కు సమాచారం ఇచ్చిన సరిపోతుంది. లేకుంటే నేరుగా ఏసీబీ కార్యాలయానికి రావచ్చు.

– శేఖర్‌గౌడ్‌, ఏసీబీ డీఎస్పీ, నిజామాబాద్‌

ఆరు నెలల్లో నాలుగు చోట్ల దాడులు

- నగరంలోని నార్త్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో ఓ రైతు వ్యవసాయ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆర్‌ఐని ఆశ్రయించారు. దీనికి ఆర్‌ఐ డబ్బులు డిమాండ్‌ చేయడంతో బాధితుడు ఏసీబీకి సమాచారం అందజేశాడు. రూ.25 వేలు ఇస్తున్న సమయంలో వీఆర్‌ఏ తోపాటు ఆర్‌ఐ రాజును ఏసీబీ అధికారులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.
- జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో ఓ ఇంటి రిజిస్ట్రేషన్‌ కోసం పంచాయితీ కార్యదర్శిని బాధితుడు ఆశ్రయించగా డబ్బులు డిమాండ్‌ చేశాడు. బాధితుడు ఏసీబీ వద్దకు వెళ్లగా, డబ్బులు తీసుకుంటుండగా అధికారులు కార్యదర్శిని పట్టుకున్నారు.
- కమ్మర్‌పల్లి మండలంలోని ఓ అధికారి సర్వీస్‌ బుక్‌లో సెలవులను పాత తేదీలో రాయడానికి సీనియర్‌ అసిస్టెంట్‌, ఎంపీడీవో డబ్బులు డిమాండ్‌ చేశారు. దీంతో ఏసీబీని ఆశ్రయించారు. రూ.10 వేలు ఇస్తున్న సమయంలో సీనియర్‌ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఎంపీడీవోను భిక్కనూర్‌లో అదుపులోకి తీసుకున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు చెక్‌పోస్టులలో తనిఖీలు చేయగా సాలూరా మండలంలోని చెక్‌ పోస్టులో లెక్క చూపని రూ.12 వేలు లభించాయి. దీనిపై కేసు నమోదు చేశారు.

రెన్యువల్‌ సరే.. వేతనాలేవి?



వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేస్తున్న ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలు (ఫైల్‌)

- కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను రెన్యువల్‌ చేసిన ప్రభుత్వం
- ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంల వేతనాలపై ఎటూ తేల్చని వైనం
- ఏడాదిగా జీతం అందక ఇబ్బంది పడుతున్న 56 మంది

మోర్తాడ్‌: కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల కాంట్రాక్టును పొడగిస్తూ ఉత్తర్వులను జారీ చేసిన ప్రభుత్వం పెండింగ్‌ వేతనాల చెల్లింపులపై దృష్టి సారించకపోవడంతో సర్వత్రా నిరసన వ్యక్తమైతుంది. జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌ సెంటర్లలో 56 మంది ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలు పని చేస్తుండగా వీరికి నియామకం జరిగిన నుంచి వేతనాలను చెల్లించలేదు. గత మార్చి 31తో కాంట్రాక్టు ఒప్పందం పూర్తి అయ్యింది. కాంట్రాక్టును రెన్యువల్‌ చేసే ప్రక్రియను ఆరంభించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించే విషయంలో మాత్రం ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. వైద్య ఆరోగ్య శాఖలోని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఉద్యోగుల నియామకం జరిగిన నుంచి వేతనాలకు బడ్జెట్‌ను కేటాయించలేదు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా అప్పటి పెద్దలు పెడచెవిన పెట్టారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించుకోవాలని ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. కాంట్రాక్టు రెన్యువల్‌ చేస్తుండటంతో ఉద్యోగ భద్రతపై నమ్మకం పెరిగింది. ఏడాది వేతనాలను చెల్లించడానికి నిధులను విడుదల చేయకపోవడంతో మాత్రం ఏఎన్‌ఎంలకు నిరాశ తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాలను చెల్లించాలని ఔట్‌ సోర్సింగ్‌ ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నేతలు

నిజామాబాద్‌అర్బన్‌: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ వద్ద నిరసన తెలిపారు. డీఈవో కార్యలయం ముందు నిరసనకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం డీఈవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నేషనల్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌, విభాగ్‌ కన్వీనర్‌ బచ్చన బోయిన శివకుమార్‌, కై రి శశి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యా సంస్థల దోపిడీ పెరిగిపోయిందన్నారు. జీవో నెంబర్‌–1 ప్రకారం పాఠశాలలో పుస్తకాలు, స్కూల్‌ డ్రెస్సులు, అమ్మవద్దని ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ విద్యాధికారులు నిద్రమత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న టీచర్‌ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌ దామ సునీల్‌, సాయికుమార్‌ అమతచారి, ప్రవీణ్‌ నాగరాజ్‌, సమీర్‌, హరినాథ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రైతు రుణాలను ఆగస్టు 15లోపు ప్రభుత్వం మాఫీ చేస్తుందని రాష్ట్ర సహకార యూనియన్‌ చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. శుక్రవారం ఆయన కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వం నాలుగు గ్యారంటీలను అమలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ రుణమాఫీ చేయడం లేదని బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

మోదీ ఇంటి ఎదుట దీక్ష చేయాలి

కాంగ్రెస్‌ హామీలను నెరవేర్చకుంటే దీక్ష చేస్తానన్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మొదట ప్రధాని మోదీ ఇంటి ఎదుట దీక్షకు దిగాలని మోహన్‌రెడ్డి సూచించారు. గుజరాత్‌కు మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి కావలసిన నిధులను ఇవ్వాలని మోదీ ఇంటి ఎదుట దీక్ష చేయాలని హితవు పలికారు. సుంకెట రవి, వేణురాజ్‌, తిప్పిరెడ్డి భాస్కర్‌, చిన్నోళ్ల రెడ్డి, అజ్మత్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

శివుడికి నాగాభరణం



నిజామాబాద్‌అర్బన్‌: నాగారంలోని నందిగుట్ట శివాలయంలో శుక్రవారం శివలింగంపైన నాగుపాము ప్రత్యక్షమైంది. ఉదయం పూజారి గుడి తలుపులు తెరిచి లోపలికి వెళ్లగా శివలింగంపైన పడగవిప్పిన నాగుపాము కనిపించింది. రాత్రంతా శివలింగంపైనే పాము ఉన్నట్లు పూజారి పేర్కొన్నారు. స్థానికులు ఈ విషయం తెలుసుకొని చూడటానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గేదెపై సవారీ



రెంజల్‌ మండలం కందకుర్తి రోడ్డులో నీల గ్రామం వద్ద ఓ వ్యక్తి గేదెపై కూర్చొని సవారి చేశాడు. ఆ మార్గంలో వెళ్లే వారు ఆయనను ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

పీవీ సేవలు మరువలేనివి



పీవీ విగ్రహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: ప్రధానిగా పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ పేర్కొన్నారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలోగల పీవీ విగ్రహానికి బాజిరెడ్డి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. నుడా మాజీ చైర్మన్‌ ఈగ సంజీవ్‌రెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్‌ దేశ్‌ముఖ్‌, రోటే సురేష్‌ శర్మ, పుల్కల్‌ రమేష్‌, అప్పల కిష్టయ్య, పురుషోత్తం పట్వారీ, లక్ష్మీనారాయణ భరద్వాజ్‌, శ్రీనాథ్‌, మల్లికార్జున్‌రావు, చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

జీజీహెచ్‌ ఎదుట బోధనా వైద్యుల నిరసన



నిజామాబాద్‌నాగారం: నల్గొండ జిల్లా ఆస్పత్రిలో పరిశీలన చేయడానికి జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్‌ ఆదేశాలు ఇవ్వడంపై శుక్రవారం నగరంలోని జీజీహెచ్‌ ఎదుట తెలంగాణ టీచింగ్‌ గవర్నమెంట్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ (టీటీజీడీఏ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కిరణ్‌మాదాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇతర శాఖల అధికారులకు తనిఖీ చేసే అధికారం లేదన్నారు. అలాగే టీచింగ్‌ డాక్టర్లకు బదిలీలు చేపట్టాలన్నారు. బోధనా వైద్యులకు సరైన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌సింగ్‌, దినేశ్‌, మురళి, సుభాష్‌, రాజేందర్‌, హరీశ్‌స్వామి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

రెంజల్‌: రెంజల్‌ మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్‌ మండలం పెగడాపల్లి నుంచి నిర్మల్‌, నిజామాబాద్‌లకు శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెంజల్‌ కమాన్‌ వద్ద సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొరికిన ఇసుక టిప్పర్లను తహసీల్దార్‌కు సరేండర్‌ చేశామని చెప్పారు. తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌ ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేల జరిమానా విధించి టిప్పర్లలోని ఇసుకను ప్రభుత్వ అవసరాలకు తరలించారు.

గోపన్‌పల్లి చౌరస్తాలో ఏడు ట్రాక్టర్లు..

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని ఖద్గాం, పుల్కల్‌ మంజీర నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు మేరకు పోలీసులు గోపన్‌పల్లి చౌరస్తాలో ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలించకుండా రెవెన్యూ అధికారులు మంజీర వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గ్రామ సేవకులను నియమించారు. ట్రాక్టర్లను గ్రామ సేవకులు అడ్డుకుంటే ఓ రెవెన్యూ అధికారి గ్రామ సేవకులకు ఫోన్‌ చేసి వదిలివేయాలని చెప్పాడు. దీంతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోపన్‌పల్లి చౌరస్తాలో పట్టుకున్నారు.

ఎడపల్లి: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్‌లను సాటాపూర్‌ గేట్‌ శుక్రవారం పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నగరంలో దుకాణాల తనిఖీ

నిజామాబాద్‌నాగారం: నగరలోని జోన్‌–1(నాందేవాడ) ప్రాంతంలో పలు హోటళ్లు, దుకాణాలను శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రభుదాస్‌ తనిఖీ చేశారు. వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన భోజనాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

బోధన్‌రూరల్‌: మద్యానికి బానిసై, భార్య పిల్లలు తనతో లేరనే మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ కథనం ప్రకారం.. మండలంలోని పెంటాకాలన్‌ గ్రామానికి చెందిన జి లక్ష్మణ్‌(28) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండటంతో ఆమె వేరుగా ఉంటుంది. దీంతో లక్ష్మణ్‌ గ్రామంలో కొంత కాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై శుక్రవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మతిస్థిమితం సరిగ్గా లేని యువకుడు..

మాక్లూర్‌: మండలంలోని మదన్‌పల్లి తండాకు చెందిన మేగావత్‌ ప్రకాశ్‌(21) మతి స్థిమితం సరిగ్గా లేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. మతి స్థిమితం లేకుండా తిరిగే ప్రకాశ్‌ ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తండా శివారులోని గుట్టపై చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉరి వేసుకున్న వ్యక్తిని ప్రకాశ్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి లింబానాయక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రాజంపేటలో..

రాజంపేట: మతిస్థిమితం బాగాలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై సంపత్‌ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జోగిపేట రంజిత్‌(25)కు కొంతకాలంగా మతిస్థిమితం బాగా లేదు. ఇంటి వద్దే ఏమి పనిచేయకుండా ఖాళీగా ఉంటూ తరచూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. 15 రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి వారిని ఇంటి నుంచి బయటకు పంపాడు. దీంతో వారు వేరే ఇంట్లో కిరాయి ఉంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రంజిత్‌ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



రంజిత్‌(ఫైల్‌)

అప్పుల బాధతో రైతు..



రవి(ఫైల్‌)

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ రవి(38) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. రవి తనకున్న ఎకరంలో వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. భూమిలో నీటి సౌకర్యం కోసం ఐదు బోర్లు వేయించినా నీళ్లు పడలేదు. బోర్లు వేయించడం కోసం అప్పులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక ఈ నెల 25న రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 26న మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లత, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్‌ తెలిపారు.

మరణంలోనూ వీడని అనుబంధం

- గుండెపోటుతో అక్కాతమ్ముడి మృతి



విజయలక్ష్మి,రామానుజస్వామి (ఫైల్‌)

సుభాష్‌నగర్‌: అక్కాతమ్ముడి అనుబంధం మరణంలోనూ వీడలేదు. 24 గంటల వ్యవధిలో గుండెపోటుతో వారిద్దరు మృత్యు ఒడికి చేరారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి (69) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందింది. అక్క మరణాన్ని తట్టుకోలేని రామానుజ స్వామి(59) గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించాడు. విజయలక్ష్మి అంత్యక్రియలు పూర్తి చేసుకుని ఆమె ఇంట్లోనే ఆయన సేద తీరుతున్న సమయంలో గుండెపోటు వచ్చింది. ఒక్కరోజు వ్యవధిలో ఇరువురు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న సదరు యువతి శుక్రవారం ఉదయం లేచేసరికి కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరు బైక్‌లు సీజ్‌

మోపాల్‌: మండలంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా నంబర్‌ ప్లేట్‌ లేని ఆరు ద్విచక్ర వాహనాలు సీజ్‌ చేసినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. అదేవిధంగా మరో 50 మంది వాహనదారులకు ఎంవీఐ యాక్ట్‌ ప్రకారం జరిమానాలు విధించామన్నారు. మరో వాహనదారుడిపై డ్రంకన్‌ డ్రైవ్‌ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పకుండా ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఇల్లు దగ్ధం



వర్ని: మండలంలోని గుంటూరు క్యాంప్‌లో శుక్రవారం విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కుర్మె వెంకట్‌ ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చెలరేగి దగ్ధమైంది. ప్రమాదంలో రూ.50 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, సరుకులు కాలిపోయాయని బాధితుడు తెలిపారు.